క్లుప్తంగా

సీఎం, మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



గంగాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ, రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులకు పెట్టుబడి సాయం రైతు ఖాతాల్లో జమ చేస్తున్నందున సోమవారం మండల పరిధిలోని గంగాపూర్‌లో రైతులు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంట్, సాగునీటికి ప్రాజెక్టులు నిర్మించడంతో వ్యవసాయం పండగలా మారిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొండం వనితరవీందర్‌రెడ్డి, సర్పంచ్ లింగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నాలుగోరోజుకు చేరిన భూనిర్వాసితుల దీక్ష



అవుసులోనిపల్లి వద్ద దీక్షలో కూర్చున్న భూనిర్వాసితులు

వర్గల్(గజ్వేల్): ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం సేకరించిన భూమికి చట్టబద్ధ పరిహారం అందజేయాలనే డిమాండ్‌తో వర్గల్ మండలం అవుసులోనిపల్లిలో భూనిర్వాసితులు చేపట్టిన దీక్ష సోమవారం నాలుగోరోజుకు చేరింది. మాజీ ఎంపీటీసీ యాదయ్య ఆధ్వర్యంలో కొనసాగిన దీక్షకు సంఘీభావం ప్రకటిస్తూ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ తోట ముత్యాలు, వర్గల్ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నాయకులు సదానందరెడ్డి, నర్సారెడ్డి దీక్షలో కూర్చున్నారు.

డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుడి నియామకం



బస్వాపూర్ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

సాక్షి ఎఫెక్ట్..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని బస్వాపూర్, అంతాయిగూడ గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తగినట్లు టీచర్లు లేరని విషయంపై ఈ నెల 25న సాక్షిలో '70 మంది.. ఒకరే ఉపాధ్యాయుడు' అనే కథనం ప్రచురితమైంది. సోమవారం డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి కథనానికి స్పందించి ఎంఈఓకు ఆయా పాఠశాలలో పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి బస్వాపూర్, అంతాయిగూడ పాఠశాలలను పరిశీలించారు. అంతాయిగూడ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉండడంతో బస్వాపూర్ పాఠశాల నుంచి ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్‌పై అంతాయిగూడకు పంపించనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

'బీఆర్‌ఎస్‌లో గ్రూపు తగాదాల్లేవు'

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి బీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఎలాంటి గ్రూపు తగాదాలు లేవని ఎంపీపీ గజ్జెల సాయిలు, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి స్పష్టం చేశారు. మిరుదొడ్డిలో సోమవారం వారు మాట్లాడుతూ.. దుబ్బాకలో బీఆర్‌ఎస్ పార్టీని దెబ్బతీయడానికే కొందరు పనిగట్టుకొని లేనిపోని అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్నీ అసత్య ప్రచారాలు చేసినా తాము కలిసికట్టుగా బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో దుబ్బాక బీఆర్‌ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ఏఎంసీ తాజా మాజీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, తాజా మాజీ వైస్ చైర్మన్ చందాపురం మల్లేశం, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సూకూరి లింగం, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య పాల్గొన్నారు.

బస్ సౌకర్యాలపై అవగాహన

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి గ్రామంలో సోమవారం విలేజ్ బస్ ఆఫీసర్ సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ బైరగోని పుష్పలీల అధ్యక్షతన ఆర్టీసీ బస్ రవాణా సౌకర్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతీ గ్రామానికి సురక్షితమైన బస్ సౌకర్యం అందిస్తున్నామన్నారు.

మున్సిపల్ నిబంధనలకు పాతర

- ఇంటి నిర్మాణాలకు నో సెట్‌బ్యాక్
- ఇష్టారాజ్యంగా సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు
- కనీసం ఒక్క వాహనం వెళ్లలేని పరిస్థితి



హుస్నాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలో ఇరుకు రోడ్డు

హుస్నాబాద్: మున్సిపాలిటీ అభివృద్ధికి అటు కేంద్రం, ఇటు రాష్ట్రం నుంచి వివిధ గ్రాంట్ల నుంచే కాకుండా నేరుగా నిధులు వరదలా పారుతున్నాయి. ఈ నిధులు సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలకు నిబంధనలకు అనుగుణంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ మున్సిపాలిటీలో నిబంధనలను పాతర వేస్తూ ఇష్టారాజ్యంగా నిధులు ఖర్చు పెడుతున్నారు.

- హుస్నాబాద్ పట్టణంలో దాదాపు 30 వేలకుపైగా జనాభా ఉంది. ఇప్పటివరకు 6వేలకు పైగా ఇళ్లు నిర్మించారు. దాదాపు ఈ నాలుగు సంవత్సరాల్లో వివిధ గ్రాంట్లు, ప్రభుత్వాల నుంచి నేరుగా వస్తున్న నిధులు దాదాపుగా రూ.40 కోట్ల పైచిలుకు చేరవచ్చని అధికారుల అంచనా.
- మున్సిపాలిటీ పరిధిలో ఓ ఇల్లు కట్టుకోవాలంటే కనీసం రోడ్డుకు సుమారుగా 30 ఫీట్లు సెట్‌బ్యాక్ కావాలి. అనుమతుల్లో మాత్రం 30 ఫీట్లుగా పేర్కొంటున్నారు. తీరా చూస్తే కొన్ని వార్డుల్లో ఇంటి నిర్మాణానికి, రోడ్లకు మధ్య 20 ఫీట్లు కూడా దాటడం లేదు.
- కొన్ని వార్డుల్లో ఒక వాహనం వెళ్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అయినా అక్కడ రోడ్లు, మురికి కాల్వలు నిర్మిస్తున్నారు.
- అధికారులపై కొందరి పాలకవర్గ సభ్యుల ఒత్తిడి మేరకు సెట్‌బ్యాక్ లేకుండానే ఎంత స్థలం ఉంటే అంతే రోడ్లు, మురికి కాల్వలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ సమయంలో సెట్‌బ్యాక్ లేకుండానే ఇళ్లు నిర్మించుకున్నా పట్టించుకోలేదు.
- కనీసం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత కూడా నిధులు ఉన్నాయని సెట్‌బ్యాక్ లేకుండానే ఉన్న స్థలంలోనే రోడ్లు వేస్తుండటంతో కనీసం ఒక వాహనం కూడా పోలేని పరిస్థితి నెలకొంది.
- ఓట్ల కోసం సెట్‌బ్యాక్ కాకుండానే రోడ్లు వేయాలని ఒత్తిడి తెస్తుండటంతో అధికారులు కూడా హుజూర్ అంటూ తలుపుతున్న పరిస్థితి.
- మున్సిపాలిటీలో జనాభా పెరగటంతో పాటు కొత్తగా ఇళ్ల నిర్మాణాలు అధికంగా చేపడుతున్నారు. భూముల ధరలకు రెక్కలు రావడంతో, ఇంటి నిర్మాణ సమయంలో 2 లేదా 3 ఫీట్లు కూడా సెట్‌బ్యాక్ కాకుండా ఇళ్ల నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇరువైపులా ఇంటి యాజమానులు 3 లేదా 4 ఫీట్ల స్థలం కోసం చూస్తే ఇంటి ఎదుట బైక్ కూడా పెట్టుకొలేని పరిస్థితి.

ఫీజు వస్తే చాలు..

- పట్టణంలో ఓ చిన్నపాటి ఇల్లు నిర్మించుకోవాలంటే దాదాపు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ఫీజు చెల్లించి అనుమతి తీసుకుంటున్నారు.
- ఆన్‌లైన్‌లో మాత్రం రోడ్డుకు కనీసం 30 ఫీట్లు సెట్‌బ్యాక్‌తో ఇంటి నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. తీరా క్షేత్రస్థాయిలో చూస్తే ఇంటి అనుమతి పత్రాలకు, ఇంటి నిర్మాణాలకు పోలిక లేకుండా సెట్‌బ్యాక్ లేకుండానే ఇంటి నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మాకు ఫీజు చెల్లిస్తే చాలు, సెట్‌బ్యాక్ అవుతున్నారా లేదా మాకేందుకు అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్న పరిస్థితి.
- గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత కూడా రోడ్లు వెడల్పు చేయకుండా ఉన్న స్థలంలోనే సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు చేపడుతున్నారు.
- వచ్చిన నిధులు వాపస్ పోకుండా ఇరుకుగా ఉన్న వీధుల్లో కూడా రోడ్లు, మురికి కాల్వలు నిర్మిస్తున్నారు. అధికారులు మేల్కోకపోతే రానున్న రోజుల్లో ఇరుకు రోడ్లతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పవు.



టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ సమీపంలో ఇరుకు రోడ్డు

చర్యలు తీసుకుంటాం..



గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో సెట్‌బ్యాక్ కాకుండానే ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. మున్సిపల్ నిబంధనల ప్రకారం ప్రస్తుతం వాటిని తొలగించే పరిస్థితి లేదు. ఆన్‌లైన్‌లో సెట్ బ్యాక్‌తోనే ఇళ్ల నిర్మాణాలకు అనుమతి వస్తుంది. కొన్ని వార్డుల్లో ఉన్న స్థలంలో సెట్‌బ్యాక్ కావాలంటే వారికి స్థలమే లేకుండా పోతుంది. కొత్తగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేవారు తప్పకుండా సెట్ బ్యాక్ అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

–రాజమల్లయ్య, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పెన్షన్ నిర్ణయించాలి

హుస్నాబాద్: జీవన వ్యయం విపరీతంగా పెరిగినందున రాష్ట్ర ప్రభుత్వంఉద్యోగుల కనిష్ట పెన్షన్‌ను రూ.30వేలుగా నిర్ణయించాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం హుస్నాబాద్ శాఖ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తమ డిమాండ్లు పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు తక్కళ్లపల్లి రాజగోపాల్‌రావు మాట్లాడుతూ.. పెన్షనర్ల నుంచి కమ్యూటేషన్ ద్వారా మొత్తం రికవరీ కాలాన్ని 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఆర్‌లు, ఇ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్ చెల్లించాలని, ఉద్యోగుల సంఘంలో 85శాతం పెన్షనర్లు సభ్యులుగా ఉన్నందున టీఎస్ జీఆర్‌ఈఏ సంఘానికి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని రాజగోపాల్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వీరసోమయ్య, రాజిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శశికళ, భాషుమియా, సుదర్శనస్వామి, కృష్ణమూర్తి, మోహన్, దేవేందర్‌రెడ్డి, రవీందర్, వెంకట్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

చేర్యాల(సిద్దిపేట): తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌ను కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ ఎస్.కె.ఆరీఫాకు చేర్యాల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజమల్లయ్య, సంఘ సభ్యులు మల్లారెడ్డి, వెంకటాద్రి, గాలయ్య, పద్మ, సుదర్శనం, సాయిలు, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాందాసు, యాదగిరి, మల్లయ్య, కనకయ్య, చంద్రమౌళి, అబ్దుల్‌సలాం, రాంమ్మూర్తి, యాదయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

బెజ్జంకి(సిద్దిపేట): క్రీడల్లో గెలుపు ఓటమిలు సహజమని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు లింగాల లక్ష్మణ్ పేర్కొన్నారు. బెజ్జంకిలో నిర్వహించిన హ్యాండ్ బాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం లభిస్తాయని తెలిపారు. అనంతరం విజేత జట్టు మద్దూరు, రన్నరప్‌గా నిలిచిన బెజ్జంకి జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు లింగాల వెంకటేశ్, హైస్కూల్ హెచ్ఎం నాగయ్య, పీఎస్ హెచ్ఎం శంకరాచారి, రిటైర్డు పీఈటీ కనకయ్య, నాయకులు గుబిరె మల్లేశం, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బొనగిరి శ్రీనివాస్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి దేవయ్య, బాలనర్సు, రాజు, తిరుపతిరెడ్డి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు

చదవడంపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యం

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ విద్యాశాఖ నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమంలో భాగంగా అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం పఠనోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పీవీ సత్యకుమార్ మాట్లాడుతూ.. చదవడం నేర్చుకోవాలి-నేర్చుకోవడానికి చదవాలి అన్న నినాదంతో కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రతిరోజు విద్యార్థులకు 40 నిమిషాల పాటు కథల పుస్తకాలు, ఇతర పాఠ్యేతర పుస్తకాలను చదివిస్తామన్నారు. చదవడంపై ప్రతి విద్యార్థిలో ఆసక్తి పెంపొందించడమే కార్యక్రమ ముఖ్య లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేథోసంపత్తి పెంపు

గజ్వేల్‌రూరల్: పుస్తక పఠనంతో మేథోసంపత్తి పెరుగుతుందని ప్రజ్ఞాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులతో కథల పుస్తకాలు, సరళ, సంయుక్తాక్షర పదాలను చదివించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమలత, వెంకటమ్మ, బాలస్వామి, లైబ్రరీ కోఆర్డినేటర్ సీత తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌సీఈఆర్‌టీ విద్యాప్రణాళికా విభాగం కో ఆర్డినేటర్ సువర్ణ వినాయక్ పఠనోత్సవం కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, జిల్లా సెక్టోరియల్ అధికారి భేతి భాస్కర్, మండల విద్యాధికారి యాదవరెడ్డి, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ప్రతినిధి సురేశ్, రూం టూ రీడ్ ప్రతినిధులు తేజస్విని, రవి, కౌన్సిలర్ పూర్ణిమ, హెచ్ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని బంజేరుపల్లి గ్రామానికి చెందిన రిటైర్డు ఆర్‌జేడీ మల్లికార్జునశర్మ జ్ఞాపకార్థం తన కూతురు విజయశర్మ విద్యార్థులకు సోమవారం నోట్‌బుక్స్, స్టేషనరీని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలస్వామి, పాఠశాల చైర్మన్ రేఖ, ఉపాధ్యాయులు మాధవి, స్వరూప, యూత్ అధ్యక్షుడు చేతన్ పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రైతు బంధు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పెట్టుబడి సహాయం రైతుబంధు డబ్బులు సోమవారం రైతుల ఖాతాల్లో నేరుగా జమ అయ్యాయి. ఒక ఎకరం అంతకంటే తక్కువ విస్తీర్ణం ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు కోసం రైతుల వద్ద నుంచి డబ్బులు తీసుకొని డీడీలు కట్టక రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న లైన్‌మెన్ మల్లేశంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రైతులు విద్యుత్ ఏఈ రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మునిగడప గ్రామానికి చెందిన రైతులు కురాడపు నర్సయ్య, రాజనర్సు, మేడిశెట్టి వసంత, ఆకుల వసంతలు వ్యవసాయ బోర్లకు లో ఓల్టేజ్ సమస్య ఏర్పడడంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని గతేడాది క్రితం లైన్‌మెన్ మల్లేశంను కోరారు. సదరు లైన్‌మెన్ నూతన ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు కోసం రైతులను డీడీలు కట్టాలని సూచించగా నలుగురు రైతులు నుంచి 28 వేల రూపాయలు లైన్‌మెన్‌కు ఇచ్చారు. డబ్బులు చెల్లించగానే వారం రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు చేస్తానని చెప్పిన లైన్‌మెన్ ఏడాది అవుతున్నా ట్రాన్స్‌ఫార్మర్ బిగించక , తిరిగి డబ్బులు అడిగినా ఇవ్వకపోవడంతో జగదేవ్‌పూర్‌లో ఏఈ రాజేంద్రప్రసాద్‌ను సోమవారం రైతులు కలిసి ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీని పదవి నుంచి తొలగించాలి

సిద్దిపేటఅర్బన్: కులం పేరుతో దూషించిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని పదవి నుంచి తొలగించాలని సిద్దిపేట అర్బన్ మండల ముదిరాజ్ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌశిక్ రెడ్డి పై ఫిర్యాదు చేశారు. సిద్ధిరాములు, సత్యనారాయణ, రాజు, సురేశ్, నర్సింలు, రంజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామ బూత్ కమిటీ ఏర్పాటు

దుబ్బాకరూరల్: మండలంలోని పోతారం గ్రామంలో బీఆర్‌ఎస్ బూత్ కమిటీలను మండలాధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. బూత్ కన్వీనర్‌గా శ్రీధర్‌గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడిగా రాజు, బీసీ కమిటీ అధ్యక్షుడిగా రమేశ్, రైతు కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ కమిటీ అధ్యక్షుడిగా నాగరాజు, మైనార్టీ అధ్యక్షుడిగా రాజ్‌మహమ్మద్, సోషల్‌మీడియా అధ్యక్షుడిగా లింగం, యూత్ కమిటీ అధ్యక్షుడిగా ప్రణీత్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం



పాఠశాల బంద్‌తో బయటకు వస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్: ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో సోమవారం ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సావుల ఆదిత్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక పాఠశాలలన్నీ విలవిలలాడుతున్నాయన్నారు. ఇప్పటికీ పాఠ్య పుస్తకాలు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గుర్తింపు లేకుండా నడిపిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాకేశ్, రాజేశ్, చరణ్, అఖిల్, మణిదీప్, ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

నంగునూరు(సిద్దిపేట): పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం నంగునూరులో పాఠశాలలను మూసివేయించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు తుపాకుల నరేశ్, లవ్‌కుమార్ మాట్లాడుతూ.. పాఠశాలలు తెరిచి 15 రోజులు కావొస్తున్నా పాఠ్యపుస్తకాలు, మౌలిక వసతులు కలి్పంచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తిరుపతిరెడ్డి, సూర్యం, చందు, అజయ్ పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఒక్కరోజు విద్యాసంస్థల బంద్ సోమవారం పట్టణంలో విజయవంతం అయ్యింది. ఏబీవీపీ విద్యార్థి నాయకులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, మేము తెలుపుతున్న నిరసనకు మద్దతు పలకాలని పాఠశాలలను బంద్ చేయించారు. కార్యక్రమంలో సిద్దిపేట నగర కార్యదర్శి చింతల పవన్‌కుమార్, నగర సంయుక్త కార్యదర్శి సంతోష్, జోనల్ ఇన్‌చార్జి లితిన్, ఫణిందర్, శంకర్, జెయష్, శ్రీకాంత్, మహేశ్, ఆకాశ్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

మోదీ నేతృత్వంలో ఆర్థికవ్యవస్థ పటిష్టం



హుస్నాబాద్‌లో ఇంటింటికీ కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

హుస్నాబాద్: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని 17వ బూత్‌లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 9 సంవత్సరాల కాలంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పథంలో పయనిస్తున్నారన్నారు. ప్రపంచ చిత్రపటంలో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చి దేశాభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక నాయకుడు ప్రధాని మోదీ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రాంప్రసాద్, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, భీమేశ్వర్, రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

తీరిన స్లాబ్ సమస్య

సాక్షి స్పందన

దుబ్బాక: 'తవ్వారు వదిలేశారు' అను శీర్షికతో ఇటీవల సాక్షిలో ప్రచురితమైనా కథనానికి అధికారులు స్పందించారు. దుబ్బాక నుంచి కొత్తపల్లికి వెళ్లు బైపాస్ రోడ్డులో పక్కనున్న మురికి కాల్వపై స్లాబ్‌ను తవ్వేశారు. దీంతో కొత్త స్లాబ్ వేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సమస్యను ఇటీవల సాక్షి పత్రికలో ప్రచురించడంతో అధికారులు స్పందించి నూతన స్లాబ్‌ను వేసి సమస్య తీర్చారు.



మురికి కాల్వపై నిర్మించిన స్లాబ్

'రైతుబంధు'తో వెల్లివిరిసిన సంతోషం

గజ్వేల్: రైతుబంధు సొమ్ము ఖాతాల్లో జమ కావడంతో రైతుల ముఖాల్లో సంతోషం వెల్లివిరుస్తుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. సోమవారం గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయాలతో ముందుకుసాగుతున్నారని, ఈ క్రమంలో రైతు బంధు పథకం తీసుకొచ్చారని కొనియాడారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, డైరెక్టర్లు బాలకిషన్, భాస్కర్‌రెడ్డి, యాదగిరి, మతిన్, బాబుయాదవ్, ప్రవీణ్, నర్సింలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

'రుణమాఫీలో నిర్లక్ష్యం సరికాదు'

కొండపాక(గజ్వేల్): రైతు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే రైతుల రుణాలు మాఫీ చేస్తామన్న హామీని ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. రెండు పర్యాయాల పాటు అధికారంలోకి వచ్చినా రుణమాఫీ చేయకపోవడంతో పాటు కొత్తగా రుణాలు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇస్తూ కేసీఆర్ సర్కార్ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ప్రజావ్యతిరేక విధానాల తీరులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ఆగడాలకు కళ్లెం వేసే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహాచారి, వీరేశం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రైతుబాంధవుడు సీఎం కేసీఆర్

బెజ్జంకి(సిద్దిపేట): పెట్టుబడి సహాయం కింద ఎకరాకు 5వేల రూపాయల అందిస్తున్న సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఒంటెల సంపత్‌రెడ్డి పేర్కొన్నారు. బెజ్జంకిలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి కోట్ల రూపాయలను వెచ్చించి సాగునీటి ప్రాజెక్టులు నిర్మించిందన్నారు. రైతుబంధు సాయం మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మండల కమిటీ సభ్యుడు ఎలుకంటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సూపరింటెండెంట్ ప్రభాకర్‌కు సామాజిక కార్యకర్త, ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ మండల కార్యదర్శి బాలకృష్ణగౌడ్ వినతి పత్రం అందించారు. గ్రంథాలయం లేకపోవడంతో విద్యార్థులు, యువత ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

◆ ఆర్థిక సాయం



చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రానికి చెందిన కొడాలి యాదగిరి, భూమిగారి రామచంద్రం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ సోమవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి యాదగిరి కుటుంబానికి రూ.10వేలు, రామచంద్రం కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్, నాయకులు ఐలయ్య, రాజేశ్, విష్ణువర్ధన్, శ్రీనివాస్, విజయ్, మహేందర్, శివ, వేణు, ఉదయ్, రాజు, అజయ్, బాబు, సంజీవ్, శేఖర్ ఉన్నారు.

◆ బేడ, బుడగ జంగాలకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

నంగునూరు(సిద్దిపేట): వచ్చే ఎన్నికల్లో బేడ బుడగ జంగాల కులస్తులకు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని సంఘం బచ్చన్నపేట మండల అధ్యక్షుడు రామదాసు డిమాండ్ చేశారు. సోమవారం నంగునూరులో బేడ బుడగ జంగాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామదాసు మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించి 22 సంవత్సరాల పాటు పార్టీకి సేవ చేస్తున్న చింతల యాదగిరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చింతల కిష్టయ్య, వానరాసి నర్సింలు, నర్సయ్య, చంద్రమౌళి, సంపత్, బాలయ్య, హనుమంతు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా సాహు మహరాజ్ జయంతి

సిద్దిపేటకమాన్: బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్ జయంతిని సిద్దిపేట పట్టణంలో సోమవారం నిర్వహించారు. సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో సాహు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్, నియోకవర్గ ఇన్‌చార్జ్ అశోక్, కార్యవర్గ సభ్యులు యాదగిరి, బాబు, మల్లేశం, భాను, మహేశ్, శంకర్, రాజు పాల్గొన్నారు.

◆ చెక్కుల పంపిణీ

హుస్నాబాద్: హైదరాబాద్‌లోని కోకాపేటలో జిల్లా ప్రొహిబీషన్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాసమూర్తి చేతుల మీదుగా ఆదివారం గౌడ సంఘం భవన శంకుస్థాపన, గీత కార్మిక కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులను పంపిణీ చేశారు. హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు బండి అంజయ్య మృతి చెందగా, అతని భార్య స్వరూపకు రూ.5లక్షలు, కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు మంతపురి యాదయ్య శాశ్వత వైకల్యానికి గురికాగా రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును హుస్నాబాద్ ఎస్‌హెచ్‌ఓ ఇన్‌చార్జి ఎస్.దామోదర్, ఎస్సై సాయికృష్ణ అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఈ నెల 27న ఫిర్యాదుల స్వీకరణ

సిద్దిపేటజోన్: తూప్రాన్ మండలం కాళ్లకల్ గ్లోస్టార్ కేబుల్స్ ప్రయివేట్ సంస్థలో నిధి ఆఫ్ కె నిఖట్ కార్యక్రమం నిర్వహించనునట్టు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(పీఎఫ్) సిద్దిపేట ప్రాంతీయ కార్యాలయ కమిషనర్ అవినాష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిర్యాదులను పీఎఫ్ ఖాతాదారులు వ్యక్తిగతంగా అందించి వాటి పరిష్కారానికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.